# ఖాకీ

పగిడిపాల ఆంజనేయులు

పోలీసు నీడంటేనే భయంతో బిర్రబిగుసుకుపోయే సాయన్నకు జీపు దిగొస్తోన్న తెల్లబట్టలోళ్ళనీ, ఖాకీ బట్టలోళ్ళనీ చూడగానే గుండె పిడికిట్లో కొచ్చింది!

"సాయన్నంటే నువ్వేనా?" అడిగాడు తెల్ల బట్టలాయన.

"నేనే బాంచెన్... ఎందుకుదొరా" నోట్లోని చుట్టని నలిపేసి వినయంగా అడిగాడు అరవైఏళ్ళ సాయన్న.

"ఆర్నెల్ల కిందట నీకు బ్యాంకు లోని చ్చింది అవునా?"

"ఒక తెల్లావునూ, నల్లావునూ కొనిచ్చింద్రు దొరా" గజగజా వణికిపోతున్నాడు సాయన్న.

నాలుగు రోజులుగా తిండిలేక పీక్కుపోయిన డొక్క మరింత లోతుకుపోయింది. గుంట కళ్ళల్లో బెదురు!

"మరి వాటినేం చేశావ్?"

"అయ్యమ్మి బిడ్డపెండ్లి జేస్తివి గదసార్" గొంతు ఎక్కడో బావిలోంచి వచ్చినట్టుంది.

"బ్రతుకుదెరువు కోసం ఋణాలిస్తే, దుబారా చేస్తావా? పద జీపెక్కు. నిన్ను అరెస్టు చేస్తున్నాం" ఉరుం ఉరిమాడు ఆఫీసర్.

"ఆ పైసల్లోని నేనేవన్న తాగిన్నా, తిన్ననా? ఎదిగిన బిడ్డ గుండెలమీద కుంపట్లెక్క ఉండె. దాన్నో ఇంటిదాన్ని జెయ్యకపోతే ఎట్లాసారు?" ఎండుకట్టె లాంటి సాయన్న కదిలిపోయాడు.

"అరె, ముసలోడా? అవ్వన్నీ స్టేషన్లో చెప్పుకుందువు గానీ పద" జీపెక్కాడు సాయన్న, జీపు ముందుకు దూకింది.

సాయన్న ఆలోచన్లు వెనక్కి పరిగెట్టినై.

★ ★ ★

నిశ్శబ్ద నీరవంలో పాలధార విన్పిస్తోంది. వెచ్చటి పాలు, కమ్మటిపాల చెంబుల్లో నిండుకుంటున్నాయి. అన్నపూర్ణ లాంటి గోవులు అమృతం లాంటి పాలు ధారపోస్తున్నాయి.



"ఊరంతా" లోన్లోత్తన్నయ్... లోన్లు... లోన్లని దరఖాస్తులు పెట్టుకుంటూ ఉంటే తనూ ఓ దరఖాస్తు పెట్టుకున్నాడు వాళ్ళకడుపులు చల్లగుండ అంగడికొచ్చి ఒక తెల్లావూ, నల్లావూ కొనిచ్చింది కరువు కాలం దాపురించె... భూమి దుమ్ముమ్మేగవట్టె.'

"అయ్యా! గీపాలు తీస్కనిపోయి కేంద్రంలా పోసిరా పో" పదహారేళ్ళ కూతురు రాజవ్వ మాటలకు ఉలిక్కిపడ్డాడు.

ఆలోచనల్లోంచి తేరుకుని పాల చెంబు తీసుకున్నాడు. సన్నగా మువ్వలు మోగించుకుంటూ 'అంబా' అని అరుస్తూ తమ తమ తల్లుల దగ్గరికి గెంతులేస్తోన్న లేగదూడల్ని మురిపెంగా చూసుకున్నాడు.

అదే సమయంలో చెట్టంత కూతురు కళ్ళముందు చిర్నవ్వుతో కన్పించింది. గుబురుగా పెరిగిన గున్నమావి కొమ్మోలే నిండైన స్త్రీత్వంతో అందంగా విరబూసిన మల్లెపొద లాంటి రాజవ్వ అతడి గుండెల్లో కుంపటి నిలిచింది!

'లక్షలకు లక్షలున్న బడా బాబులకే తప్పలేదు ఈ ఆవేదన! పేద బక్కోడు తనెంత? ఎంత చెట్టుకంతే గాలి అన్నట్టు పండోపైసో ఇచ్చి దీన్నీ ఓ అయ్య చేతిలో బెట్టకపోతే తను బతికెందుకు? రాజవ్వకు దబ్బున్న పెండ్లి జెయ్యాలే నెత్తిమీదున్న బరువు దించుకోవాలె' యథాలాపంగా నడుస్తోన్న సాయన్నకు ఓ విషాద కెరటంలా అతడి భార్య స్మృతి పథంలో కొచ్చింది.

భార్యతాలూకు నీడలో అతడి ముఖం బాధతో పాలిపోయింది!

"లేకలేక పుట్టిన బిడ్డ...దాని ఆటపాటకు నోచుకోనయితిని ఇగనుంచి. తండ్రివైనా నువ్వే తల్లివయినా నువ్వే, దాన్ని దిక్కులేందాన్ని జెయ్యకు మంచి సంబంధం జేసి ఓ అయ్య చేతిలబెట్టు, బిడ్డకు ఏ కట్టం రాకుంట జూసుకో ఇగ నేను... నేను... నా..పని... అయి పోయింది. పోతన్నా... ఎళ్ళి... పోతన్న..."

దీనంగా చేతులు జోడించి కళ్ళుమూసింది శాశ్వతంగా. సాయన్న కనుకొలుకుల్లోంచి కన్నీళ్ళు తుడుచుకున్నాడు.

"అయ్యా! పొయ్యిమీన పాలుకాగుతున్నయ్ తాగిపో!" కళ్ళాపి జల్లుతోన్న రాజవ్వ కేకేసింది.

"ఆఁ ఆఁ గట్లనే తాగిపోతగాన్లేయ్"

అతడు పాలుతాగి అవుల్ని కొట్టుకొని పొలానికి బయల్దేరాడు. నీళ్ళకుండతో ఎదురొచ్చింది రాజవ్వ. మరోసారి సాయన్న గుండెను రంపంతో కోసినట్టుగా విలవిల్లాడాడు.

ఆ క్షణంలోనే స్థిరంగా నిశ్చయించుకున్నాడు.

"బిడ్డ పెండ్లి తప్పక జెయ్యాలె"అని.

ఆ మరుసటి రోజే అవుల్ని సంతకి తోలికెళ్ళాడు, బేరం కుదిరింది.

సుతారంగా తోకాడిచ్చుకుంటూ కదిలిపోతోన్న ఆవుల్ని దీనంగా చూశాడు. అతడి చేతిలోని డబ్బు వికృతంగా కన్పించింది.

కళ్ళముందు కూతురు ప్రత్యక్షమయింది. ఇన్నాళ్ళూ తిండిబెట్టి ఆదరించిన కన్నతల్లిని అమ్ముకున్నట్టుగా అన్పించి పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు.

అవులు కనుమరుగయ్యేంత వరకూ అక్కడే ఉండి నిస్సహాయంగా వెనక్కి తిరిగాడు సాయన్న.

నెలరోజుల్లో కూతురు ఓ ఇంటిదయింది. అతడి గుండెలమీద కుంపటి దిగింది!

శిథిలమైన తాటికమ్మల గుడిసె, సాయన్నకు మిగిలింది చివరకు.

"అయ్యా! ఇపుడు నన్నేడికి తీస్కుపోతుండ్రు?" జ్ఞాపకాల్లోంచి బయటపడ్తూ అడిగాడు

"జైలుకి"

"సచ్చి మీ కడుపున బుడ్త బాంచెన్ గాపనే జెయ్యండ్రి... నాల్రోజులాయె తిండి లేక" అప్రయత్నంగానే చేతులు జోడించాడు సాయన్న. అతడి అదృష్టం కొద్దీ కోర్టు కూడా అతణ్ణి నేరస్తుడిగా నిర్ధారించింది! ప్రభుత్వం సొమ్మును వృథా చేసిన ఘరానా నేరస్తుడు సాయన్న! ఇపుడు సాయన్న మనస్సు విహంగంలా ఎగిరిపడ్తోంది!

అటు బిడ్డ పెళ్ళితో... బిడ్డబాకీ తీరిపోయిందనీ, ఇటు జైలుశిక్షతో... గవర్నమెంటు 'బాకీ' తీరిపోతుందన్న ఆనందమూ... టైంకి తిండికూడా దొరుకుతోందనే సంతోషమూ... అతణ్ణి ఉక్కిరి బిక్కిరి చేస్తూంటే... జైల్లో అన్నం చూసిందే తడవు... అవురావురుమంటూ తినడం మొదలెట్టాడు సాయన్న! ☆

## ఫ్లాప్ అయినా...



'నెంబర్ వన్' హీరోయిన్ అయిపోయినట్టే అనుకుంటుండగా జూహీ చిత్రాలు కొన్ని వరసగా ఫ్లాప్ అయ్యాయి. అయినా కూడా వాటి ప్రభావం ఆమె కెరీర్‌పై పడలేదనే చెప్పాలి.

ఎందుకంటే జూహీచావ్లా పారితోషికంలో మార్పేమీ కనిపించడంలేదు. ఇటీవల ఆమె ఒప్పుకున్న మూడు కొత్త సినిమాలకు ఆమెకు సినిమాకి 25 లక్షల వరకు ముడుతుందట. ఇంత భారీ రెమ్యునరేషన్ డిమాండ్ చేయగల్గుతోందీ అంటే ఇంకా క్రేజ్ ఉన్నట్టే కదా!

-మౌర్య.

## తేడా

టీచర్ అడిగింది రాజుని.

"ఈవేళ పరీక్ష ఎలా రాశావురా"

"నిన్నటిలాగే సార్"

"నిన్న ఎలా రాశావు"

"ఈరోజులాగే సార్"

-కె.వి.మధుసూదనరావు,కాకినాడ.